# సందిగ్ధం

## చిత్తూరి కోటేశ్వరరావు

"ఏమయ్యా నీ పేరేంటి?" ప్రశ్నించాడు ఆ పోలీస్ అధికారి.

"సింహాచలమండి......" వినయంగా చెప్పాడతను.

"ఏ ఊరు" తిరిగి ప్రశ్నవేశాడు ఆ పోలీసు అధికారి.

"శ్రీకాకుళమండి.... మందసలో పుట్టి పలాసలో చదువుకున్నాను. మా నాన్న కూలీ. హైదరాబాద్ ఫ్రీజోన్ అటండీ.... అందుకే ఇక్కడ సివిల్ పి.సి.గా సెలక్టయి ఆరేళ్ళ నుంచీ ట్రాఫిక్‌లోనే వున్నానండీ. ఈ మధ్యనే బహద్దూర్‌పురాలో గవర్నమెంట్ క్వార్టర్ దొరికిందంటే....." సింహాచలం అమాయకంగా చెప్పాడు.

"అదేమిటీ ..... బేగంపేటలో కానీ..... ఇంకెక్కడా దొరకలేదా?"

"బేగంపేటలో పోలీస్ క్వార్టర్ దొరకాలంటే అక్కడున్న ఏ.సి.గారికి ఎవరయినా పెద్ద ఆఫీసర్ చెప్పాలండీ.... నాకెవ్వరు లేరండీ బాబు....ఇక్కడయితే ఎవరూ చేరడం లేదండి.... ఖాళీగా వున్నాయని డి.సి.పి గారిని అడిగితే ఇచ్చేసారండీ...." గడగడా పాఠం అప్పచెప్పినట్టు చెప్పుకుపోతున్నాడు సింహాచలం.

"ఇంతకూ నువ్వు అదనపు డి.జి. గారి కారెందుకు ఆపావు?" తిరిగి విసుగ్గా రెట్టించాడు ఆ పోలీసు అధికారి.

"సార్.... మొన్న శుక్రవారం పెరేడ్‌లో మా అందరికీ చెప్పారండీ".

"ఏమని?"

"గౌరవనీయులైన రాష్ట్ర గవర్నర్‌గారి కారు, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారి కారు మీద తప్ప ఏ కారు మీదా లైట్ వుండకూడదంట. అలా ఎవరయినా కారు మీద లైటు పెట్టుకుంటే మొదటిసారి మర్యాదగా చెప్పమన్నారండీ... రెండవసారి కేసు పెట్టమన్నారండీ..... అంతేనండీ....." ఉన్నది ఉన్నట్టు చెప్పాడు ట్రాఫిక్ పి.సి. సింహాచలం.

ఆ పోలీసు అధికారికి ఏమనాలో తోచలేదు.

* * *

టాంక్‌బండ్.

అక్కడి ట్రాఫిక్ కానిస్టేబుల్స్ అందరూ వారి విధి నిర్వహణలో మునిగి వున్నారు.

సింహాచలానికి డ్యూటీ అక్కడేవేశారు.

ఆఫీసులకు వెళ్ళే సమయం కావడంతో గవర్నమెంట్ వెహికిల్స్ అన్నీ జోరు జోరుగా వెళుతున్నాయి.

కొన్ని పోలీసు వాహనాలు రెడ్‌లైట్ వేసినా కూడా దూసుకుపోతూనే వున్నాయి.ఆ డ్రయివర్‌లను అడిగేవాడు ఎవడు?కారులో కూర్చున్న అధికారులు కూడా 'అదేమిటని' అనరు....

పాపం.....సింహాచలం ఎంతో ఉత్సాహంతో మూడు స్టార్స్ వున్న కారుపైని లైట్ చూసి, చాలా సంతోషించి పరుగెత్తుకుంటూ కారు దగ్గరకు వెళ్ళాడు.

ఆ కారు కూడా రాకెట్‌లా వెళ్ళిపోయేదే.....

కానీ, అప్పటికే ఎదురొచ్చేశాడు ట్రాఫిక్ పి.సి. సింహాచలం.

కురుక్షేత్రంలో అభిమన్యుడిని కౌరవులంతా ఒక్కసారిగా చుట్టుముట్టి పద్మవ్యూహంలో ఆపివేసినట్టు కావడంతో దిక్కుతోచని అభిమన్యుడిలాగా అదనపు డి.జి. డ్రయివర్ షరీఫ్ ఒక్క కుదుపులో కారును ఆపాడు.

షరీఫ్ చేతి మీద వున్న భుజకీర్తులను చూసి ఒక సెల్యూట్ కొట్టి.... "హెడ్డు గారూ.....నిన్ననే ఒక సర్క్యులర్ వచ్చింది. తెల్దేటి? కారు మీద లైటుని సార్ ఆఫీసులో దిగిన తరువాత పి.టి.ఓ.కు వెళ్ళి లైట్ తీసేయండీ...లేపోతే కేసు ఎట్టేయమన్నారు...." తడుముకోకుండా అన్నాడు ట్రాఫిక్ పి.సి. సింహాచలం.

"ఛల్......ఛల్‌రే బేవకూఫ్.....క్యా బోల్ తే హై తెలుగుమే.....లైట్, నికాల్‌నేకా, కార్లో వుంది ఎవరో తెలుసా.....డి.జి.పి.రే.....హుల్లూ....." అంటూ తన దైన పద్ధతిలో హూంకరించాడు షరీఫ్.

"ఏయ్......క్యా హోరై (హోరహీహై)...."

వెనుక సీట్లో వున్న అధికారి...... అప్పుడే నిద్రనుంచి లేచినట్టున్నాడు అసహనంగా డ్రయివర్‌ను విసుక్కున్నాడు.

"ఏ ట్రాఫిక్ సాలేకా దిమ్మాక్ కరాబ్ హోగయా సాబ్.....గాడీకా ఊపర్ లైట్ నికాలనే కా బోల్ రహీహై...."

ఈ లోపల వెనుక వైపు నుంచి వస్తున్న వాహనాల డ్రయివర్లు ఒక్కసారిగా హారన్లు మోగించడంతో టాంక్ బండ్ దద్దరిల్లింది.


అక్కడే నిలుచుని రేబాన్ గ్లాసులు ధరించి, ఒక కాలు మోటారు సైకిలు మీద పెట్టి.......అదే మోటర్ సైకిల్‌పైన టోపీని పెట్టి మారుతీకారుని నడుపుతున్న మగువను కళ్ళతోనే చుంబిస్తున్నారు ట్రాఫిక్ ఎస్.ఐ.గారు.

కారు హారన్లు ఒక్కసారిగా వినిపించడంతో ఆయన ఒక్కసారిగా ఈ లోకం లోకి వచ్చి, కాలు దించి........టోపీ నెత్తిన పెట్టుకోవడం మరచిపోయి, పరుగెత్తుకువెళ్ళి సింహాచలాన్ని చేయి పట్టి గుంజాడు.

అదనపు డి.జి.గారి కారు వెళ్ళిపోయింది.

ట్రాఫిక్ క్లియర్ అయింది.

* * *




"ఒరే సింహాచలం.... నువ్వు ఉత్త వెధవ్విరా. నీ అదృష్టం బాగుంది. పెద్ద ట్రాఫిక్ జామ్ కాలేదు. అయ్యుంటే నీ ఉద్యోగం గోవిందా. అయినా నువ్వేంటిరా నువ్వొక్కడివే హైదరాబాద్ ట్రాఫిక్‌ను బాగు చేసేస్తావా.... ఇంకెప్పుడయినా ఇలాంటి వెధవ పనిచేస్తే రిపోర్ట్ రాసి సస్పెండ్ చేయిస్తాను...." అంటూ కోపంతో రెచ్చిపోయాడు ట్రాఫిక్ ఎస్.ఐ మదన్.

"అదేటండీ.....నిన్న పొద్దున మీరే కదా పెరేడ్‌లో ఓ....దంచేశారు. గవర్నర్‌గారి కారు, ముఖ్యమంత్రిగారి కారు మీద తప్ప ఇంకే కారు మీద లైటు వుండకూడదనిచెప్పారు కదా...... అయినా

సారూ....... మీరు సెయ్యమంటారు. తీరా, సేసిన తరువాత తిడతరు. మహాగొప్పగా వుంది సార్ మన డిపార్టుమెంట్.

"సెప్పేదొకటి.....చేసేదొకటి.... అయితే నన్నూరికే చేతులూపమంటారేంటి? ఇంకేమి డ్యూటీ సేయకూడదా? నాకు తెలీక అడుగుతాను సారూ....మనం ఏ మంత్రిగారి కారో, ఏ ఛెయిర్‌మన్‌గారి కారో, లేక ఇంకెవరి కారునో ఆపి లైటు తీయమన్నాం అనుకోండి.... వాళ్ళు ఏమంటారు.... ముందు మీ డిపార్టుమెంటోళ్ళ సంగతి చూసుకోండి అంటారు కదా..... ముందు మనం మన ఇల్లు కడుక్కోవాలి కదా. నానేటి తప్పు చేసినాను... మహా గొడవ చేసేస్తున్నారు...." అని విధి నిర్వహణలో నిమగ్నమయ్యాడు ట్రాఫిక్ కానిస్టేబుల్ సింహాచలం.

"......జిమ్మేదార్ వహీద్.... ఈ సింహాచలాన్ని ట్రాఫిక్ పాయింట్ దగ్గర పెట్టకండయ్యా..... కేసులు రాయడానికో, లారీలు ఆపడానికో పెట్టండి..." చిరాగ్గా అన్నాడు ట్రాఫిక్ ఎస్.ఐ.

"అరె....యీయనకు లారీలు ఆపేదగ్గర పెడితే సత్యనాస్ హోతా సాబ్....మై ఉన్‌కో సమఝాదోంగా ........"

* * *

"వహీద్.... ఆ ట్రాఫిక్ పి.సి. నెంబరెంత? వాడి పేరేంటి? స్టుపిడ్ బగ్గర్.... యూస్‌లెస్‌ఫెలో......ఆ... అవన్నీ ఆఫీసులో కొచ్చి ఇవ్వు...." అంటూ హుకుం జారీ చేసి మెట్లెక్కాడు ఆ పోలీసు అధికారి.

"క్యాంప్ క్లర్క్........డి.సి.పి ట్రాఫిక్‌ను మాట్లాడమను......"

రెండు నిమిషాల తరువాత- "అరె యార్.....క్యా భగవాన్ హైరే....ఉల్లూ కా పట్టే....ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ సింహాచలం బోల్‌కే ఏక్ బేవకూఫ్ హైరే...... యూనో వాట్ హేపెన్డ్....దట్ జోకర్... హి స్టాప్డ్, మై కార్...... అండ్ ఆర్డరింగ్ ద డ్రయివర్ యువర్‌మైండ్.." అని హూంకరించాడు ఆ అదనపు డి.జి. గారు.

"సార్......కొంచెం ఉండండి సార్.... డి.సి.పి గారు బాత్‌రూమ్‌లో వున్నారు....."

అవతలవైపు నుంచి వచ్చిన రిప్లయ్ ఇది....

అదనపు డి.జి. గారికి వళ్ళు మండిపోయేటంత కోపం ముంచుకొచ్చింది.

"క్యాంప్ క్లర్క్....యు ఆర్ అనదర్ స్టుపిడ్.... డి.సి.పి గారికి లైన్లో ఇవ్వమంటే డి.సి.పి. క్యాంప్ క్లర్క్‌కు లైన్ ఇస్తావా..... నా టైమ్ అంతా వేస్ట్... ఆ డి.సి.పి.గారిని ఒకసారొచ్చి కలవమను. నేను టీ క్లబ్‌లో వుంటాను...

"అలాగే సర్...."

పావుగంట తరువాత....

డి.ఐ.జి.లు ఐ.జిలు, అదనపు డి.జిలు అందరూ ఒక ఐ.జి గారి గదిలో కూర్చుని టీ సేవిస్తున్నారు.

డి.సి.పి. ట్రాఫిక్‌గారు అదరాబాదరగా అదనపు డి.జి గారిని చూడడానికి డి.జి.పి గారి కార్యాలయానికి వచ్చారు.

"సార్....సార్.......సార్....ఐయామ్ వెరీ సారీ......ఫర్ దట్ కానిస్టేబుల్స్ బిహేవియర్" అంటూ వచ్చీ రావడంతోనే క్షమాపణలు చెప్పడం మొదలుపెట్టాడు అతను.

"అరె.... నువ్వెందుకయ్యా అంత బాధపడిపోతావ్.... నువ్వు కాదు కద తప్పు చేసింది. వాడెవడో కానిస్టేబుల్ చేశాడు. మీకెందుకు అంత బాధ..." అన్నాడు ఒక అధికారి.

లీడర్‌షిప్ క్వాలిటీస్....సబార్డినేట్స్‌కు సపోర్ట్ చేయడం....

"చిన్నవాడు కదా...... కొత్తగా సిటీకి వచ్చాడు కదా.. అందుకే కానిస్టేబుల్ చేసిన తప్పుకు తనే క్షమాపణ చెబుతున్నాడు." అని వ్యాఖ్యానించాడు ఇంకొక అధికారి.

"అరె.... చాలా గొప్ప క్వాలిటీస్ వున్నాయే మన డి.సి.పి.గారికి.... రండి ముందు టీ తాగండి...."

అన్నాడు హోస్ట్.

"లేదు సార్..... చాలా పని వుంది. వెళ్ళిపోవాలి" అంటూ డి.సి.పి గారు మరొకసారి సెల్యూట్ చేశాడు.

"ఫరవాలేదులే. ఓ పది నిముషాలు నువ్విక్కడ వుంటే హైదరాబాద్ ట్రాఫిక్‌లో అల్లకల్లోలం రాదులే. సీనియర్ ఆఫీసర్ టీ ఆఫర్ చేస్తే జూనియర్ ఆఫీసర్ తాగవలసిందే. నేర్చుకో..... ఎల్లకాలం పని చేయకూడదు" అంటూ మధురంగా మందలించాడు.

కూర్చోకుండానే గబగబా టీ తాగి అందరికీ కామన్‌గా మరోసారి సెల్యూట్ చేసి పరుగెత్తినట్టు పారిపోయాడు ట్రాఫిక్ డి.సి.పి.

* * *

ట్రాఫిక్ పి.సి. సింహాచలాన్ని ట్రాఫిక్ బ్రాంచ్ నుంచి జ్యువనైల్ బ్యూరోకు మార్చుతున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు డి.సి.పి ట్రాఫిక్.

"వెధవకు క్రిమినల్ టెండెన్సీ ఏమయినా వుందేమో.... ఈ రివల్యూషనరీ ఏటిట్యూడ్ మంచిది కాదు. ఈ వెధవలకు సరి అయిన పాఠం చెప్పాలి.... "
ఒక అధికారి తన అక్కసునంతావెళ్ళగక్కాడు.

ఆ మరుసటి రోజు ఉదయం....

అన్ని వార్తాపత్రికలు..... సింహాచలం బదిలీ ఉత్తర్వుల గురించి పలు రకరకాలుగా వార్తలు ప్రచురించాయి.

డి.జి.పి. గారిని హోంశాఖామాత్యులు అసలు విషయం ఏమిటో కనుక్కోమన్నారు.

ఐ.జి.లు, అదనపు ఐ.జిలు, ఇతర ముఖ్య అధికారులు డి.జి.పి. కార్యాలయంలో సమావేశమయ్యారు.

"ట్రాఫిక్ పి.సి. సింహాచలం....శ్రీకాకుళం జిల్లా.... మందసా వాస్తవ్యుడు... పలాసలో చదువుకుని హైదరాబాద్ సిటీలో ఆరు సంవత్సరాల క్రితం సివిల్ పి.సి.గా సెలెక్టయి ట్రాఫిక్‌లో ఇప్పటిదాకా చేస్తూనే వున్నాడు. వెరిఫికేషన్ రూల్స్ ప్రకారంగా ఇతను మంచి నడవడిక కలిగినవాడు. యాడ్‌వర్స్‌గా ఏమీ లేదు" అంటూ తన నివేదికను గూఢచార సంస్థ అధికారి తెలియచేశాడు.

"వెధవకు క్రిమినల్ టెండెన్సీ ఏమయినా వుందేమో.... ఈ రివల్యూషనరీ ఏటిట్యూడ్ మంచిది కాదు. ఈ వెధవలకు సరి అయిన పాఠం చెప్పాలి.... " ఒక అధికారి తన అక్కసునంతా వెళ్ళగక్కాడు.

"రిక్రూట్‌మెంట్ సరిగ్గా జరగడం లేదు....."

"రిక్రూట్‌మెంట్‌లో ఏం తప్పు వుంది...ఎవరయినా రిక్రూట్ చేస్తున్నారా వన్‌స్టార్ టెస్ట్, త్రీస్టార్‌టెస్ట్‌లన్నింటిలో పాల్గొనేది, అర్హత పొందేది పాల్గొనే వారే... ప్రతి వ్యక్తీ ఈ టెస్ట్‌లన్నీ పాస్ కావలసిందే. ఆ తరువాత రాత పరీక్ష కూడా వాళ్ళే రాయాలి. వాళ్ళకు బదులు వేరెవరయినా రాయడం లేదే. ఇంకా ఆపైన మౌఖిక పరీక్ష. అందులో కూడా వాళ్ళే పాల్గొనేది. అన్నింటిలో వాళ్ళే పాస్ అవుతున్నారు. వాళ్ళే సెలెక్ట్ అవుతున్నారు. అందులో మనం చేసేది ఏముంది? ఇంకా రిక్రూట్‌మెంట్ ఎక్కడ? సరిగ్గా లేదని ఊరికనే కామెంట్ చేస్తే ఎట్లా?" మరొక అధికారి వేడివేడిగా తన మనసులో ఉన్నదంతా బయటపెట్టాడు.

"పూర్వాపరాలు తెలుసుకోకుండా మాట్లాడడం మన డిపార్ట్‌మెంట్‌లో చాలా తేలికైపోయింది...." మరొక అధికారి విసుక్కున్నాడు.

"క్రిమినల్ టెండెన్సీ ఉందనడానికి సింహాచలం క్రిమినల్ ట్రైబ్ కాదే... మందసకు కింతలికి చాలా దూరం వుందే" అన్నాడు ఒకప్పుడు ఆ జిల్లాలో పనిచేసిన అధికారి.

అన్నీ మౌనంగా వింటున్న డి.జి.పి గారు మౌన సముద్రాన్ని ఒక్కసారిగా చేధించి

"ఇంతకూ సింహాచలం చేసిన తప్పు ఏంటి?" అని అడిగాడు.

బిస్కట్లు, టీలు సేవించిన తరువాత ఒక అధికారి అసలు విషయాన్ని తెలియచేశాడు.

"అదనపు డి.జి.గారి కారు మీది రెడ్‌లైట్‌ను తీసివేయాలని, ఆయన కారు డ్రయివర్‌కు చెప్పడం సింహాచలం చేసిన నేరం... దానికి ఫలితం ట్రాన్స్‌ఫర్!"

"సార్... తమరిని హోం మినిస్టర్‌గారు అర్జెంటుగా సెక్రటేరియట్‌కు వచ్చి కలుసుకోమన్నారు...." డి.జి.పి. గారి పి.ఏ. సకల వినయ విధేయతలతో ఆయనకు ఒక్కరికే వినపడేలా చెప్పాలనే ప్రయత్నంలో సఫలీకృతుడు కాలేక గొంతు తగ్గించి మాట్లాడే నైపుణ్యం లేకపోవడంతో మైక్‌లో చెప్పినట్టు చెప్పాడు.

"సరే.... తరువాత చూద్దాం... ఇంకా ఏమయినా డిటెయిల్స్ ఉన్నాయేమో కనుక్కోండి..." అని గుఢచారి సంస్థ అధికారికి ఉత్తర్వులు జారీ చేయడంతో ఆనాటి సభ అంతటితో ముగిసింది.

* * *

సాయంత్రం ఐదు గంటలు....

సింహాచలాన్ని తిరిగి ట్రాఫిక్‌కు పంపడమా లేక అందులోనే కొనసాగించమని చెప్పడమా అని ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాడు డి.జి.పి.

'వనజభవుడు నిన్నొసట లిఖితంబు....." అన్న భర్తృహరి పద్యాన్ని తెలుగులోకి ఎవరు అనువదించారూ? ....ఏనుగు లక్ష్మణ కవా? లేక మరొకరా? అనుకుంటూ డి.జి.పి.గారు అసలు సంగతి మరచిపోయారు.

సింహాచలం మాత్రం 'ఎవరు చేసిన ఫలం వారు అనుభవింపక తప్పదన్నా' అనే సూక్తిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ అదే టాంక్‌బండ్ మీద... చిన్నపిల్లల చేత శనక్కాయలను అమ్మిస్తున్న పెద్దవాళ్ళపై కేసులు పెట్టడానికి ప్రయత్నం చేస్తూనే వున్నాడు!